సాక్షి
సంగారెడ్డి
7
సోమవారం ׀ 20 ׀ అక్టోబర్ ׀ 2025



న్యూస్‌రీల్

జీవితాల్లో వెలుగులు నింపాలి

కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి జోన్: దీపావళి వెలుగులు ప్రతీ ఇంటిలో ఆనందం నింపాలని ఈ పండుగను ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకాంక్షించారు. టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. పర్యావరణహిత టపాసులను వినియోగించడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు తప్పనిసరి

రాయికోడ్(అందోల్): సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్మాలంటే రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్‌బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సారిక స్పష్టం చేశారు. పంట విక్రయించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని కేంద్ర ప్రభుత్వం యాప్‌లో స్లాట్ బుక్ చేయించుకునే ప్రక్రియను తప్పనిసరి చేసిందని ఆదివారం ఓ ప్రకటనలో వివరించారు. పత్తి రైతులు తమ పరిధిలోని ఏఈఓలను సంప్రదించి యాప్‌లో తమ పేరుపై బుకింగ్ అయిందా లేదా అనే అంశాన్ని గుర్తించాలన్నారు.

లింగాయత్ సమాజ్ అధ్యక్షుడిగా రాజశేఖర్



రాజశేఖర్ షెట్కార్‌ను సన్మానిస్తున్న లింగాయత్ ఉద్యోగుల సంఘం నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ లింగాయత్ సమాజ్ అధ్యక్షుడిగా రాజశేఖర్ షెట్కార్ వరుసగా నాలుగవసారి ఎన్నికయ్యారు. పట్టణంలోని బసవ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాజశేఖర్ షెట్కార్‌ను వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు, ఉద్యోగ సంఘం నాయకులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ షెట్కార్ మాట్లాడుతూ..వరుసగా సమాజ్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృజ్ఞతలు తెలిపారు. లింగాయత్ సమాజ్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇబ్బందులు


జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్



డ్రైనేజీ పనులను చేయిస్తున్న చంద్రశేఖర్

పటాన్‌చెరు టౌన్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ బాలాజీ నగర్ కాలనీ వాసులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ బాలాజీ నగర్ కాలనీలో సీసీరోడ్డు కారణంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య నెలకొనడంతో డ్రైనేజీ పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సీసీ రోడ్డు వేయగా..అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మూసుకుపోయి, ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొందన్నారు.

భవన్స్‌లో ఘనంగా దివాళీ మేళా



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బెల్ టౌన్‌షిప్‌లోని భవన్స్ పాఠశాలలో శనివారం రాత్రి దివాళీ మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీసీపీ సృజన, భవన్స్ హైదరాబాద్ వైస్ చైర్మన్ గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాలపై చిన్ననాటి నుంచి విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బెల్ జీఎం డా.సంధ్యాకర్, ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందడి



సంగారెడ్డిలో బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా దీపావళి సందడి నెలకొంది. పండుగశోభను అలంకరించేందుకు ప్రజలు మార్కెట్లకు వచ్చి పూజాసామగ్రి, దీపాంతలు, లక్ష్మీదేవి విగ్రహాలను కొనుగోళ్లు చేస్తున్నారు. వీటితోపాటు బాణసంచా సామగ్రిని కూడా ప్రజలు కొంటున్నారు. సంగారెడ్డిలోని బహిరంగ మార్కెట్లన్నీ ఆదివారం కిక్కిరిసిపోయాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



మార్కెట్లో అందుబాటులో ఉంచిన లక్ష్మీదేవి ప్రతిమలు



లక్ష్మీదేవి విగ్రహంతో యువతి

జాడలేని కొనుగోలు కేంద్రాలు

- అన్నదాతల ఎదురుచూపులు
- మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5.328
- రూ.4 వేల లోపే కొంటున్న వ్యాపారులు
- నష్టపోతున్న సోయా రైతులు

కొనుగోలు కేంద్రాలను ఎప్పుడెప్పుడు ఏర్పాటు చేస్తారని సోయా రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో దళారులు సోయా పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– జహీరాబాద్ టౌన్:

జిల్లాలో వరి,పత్తి, కంది,మొక్కజొన్న తర్వాత వేలాదిమంది రైతులు సోయాబీన్ పంటను సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 80 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. జిల్లాలోనే జహీరాబాద్ ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో పంటను వేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిని దిగుబడి పడిపోయింది. కాత పూత దశలో కూడా భారీ వర్షాలు కురవడంతో పంటల దిగుబడిపై ప్రభావం చూపింది. ఏర్పడిన నష్టాన్ని ధర రూపంలో అయినా తీరనుందని రైతులు ఆశతో ఉన్నారు. అయితే పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు.



జహీరాబాద్ మార్కెట్‌కు సోయాబీన్ పంట

కనీస మద్దతు ధర రూ.5,328

కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో క్వింటాల్‌కు రూ 4.892 ఉండగా 2025–26 ఏడాదికి రూ.5.328గా నిర్ణయించింది. కోతలు ప్రారంభంకావడంతో మార్కెట్‌కు పెద్ద మొత్తంలో ధాన్యం వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు బదులు వ్యాపారులు రూ.4 వేలకు లోపే పంటను కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం వల్ల కొంతమంది రైతులు గత్యంతరం లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. గతేడాది జహీరాబాద్ డివిజన్ పరిధిలో ఝరాసంగంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పుడు కూడా ఉత్పత్తిలో నాలుగవంతే కొనుగోలు చేయడం వల్ల మిగిలిన పంటను మార్కెట్‌లో వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. జహీరాబాద్ డివిజన్‌లోని గంగ్వార్, కోహీర్, మొగుడంపల్లి వద్ద ప్రైవేట్ వ్యక్తులు నారింజ రైతు మిత్ర సంఘం పేరుతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సోయాబీన్ పంటను కొంటున్నారు. వీరు కూడా క్వింటాల్‌కు రూ.4 వేల లోపే ధాన్యం తీసుకుంటున్నారు. పెట్టుబడులు విపరీతంగా పెరిగాయని, వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి పడిపోయిందని. తీవ్రంగా నష్టపోతున్నందున అధికారులు వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

వేధిస్తోన్న బాండ్ పేపర్ల కొరత

- భూ క్రయవిక్రయాలతో పాటు ఇతర పనులకు వినియోగం
- దొరకని రూ.20,రూ.100ల పేపర్‌లు
- పెండింగ్ లో వివిధ రకాల పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సంగారెడ్డి జోన్: జిల్లాలో స్టాంప్ బాండ్ పేపర్ల కొరత ఏర్పడింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి అవసరాల మేరకు సరఫరా కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. లైసెన్స్‌డ్ స్టాంప్ వెండర్ల వద్ద లభించే బాండ్ పేపర్లు గత కొన్ని రోజుల నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో అటు సాధారణ ప్రజలతోపాటు దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా బాండ్ పేపర్లు దొరకకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటుండటంతో తమ పనుల్లో ఆలస్యం అవుతుందని పలువురు చెబుతున్నారు.

వివిధ రకాల పనులకు ఇబ్బందులు

బాండ్ పేపర్ల కొరత ఏర్పడటంతో వివిధ రకాల పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భూములు, ఇండ్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు, కుల ధ్రువీకరణ, వివిధ రకాల పనులకు సంబంధించిన అగ్రిమెంట్లు, లీగల్, నోటరీ, అమ్మకాలతోపాటు ఇతర పనులకు పేపర్లను వినియోగిస్తుంటారు. రూ.20, రూ.50, రూ100ల బాండ్ పేపర్లు అందుబాటులో ఉంటాయి. అయితే వారి వారి అవసరాలను బట్టి వాటిని కొనుగోలు చేస్తుంటారు. ఎక్కువగా రూ.20, రూ.100 ల పేపర్లు వినియోగిస్తుంటారు. ప్రతీరోజు జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణతోపాటు ఇతర ప్రాంతాల్లోని స్టాంప్ వెండర్ల దుకాణాలకు వస్తుంటారు. పేపర్ల కొరత ఉండి లభ్యం కాకపోవడంతో తమ పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.



రూ.20ల బాండ్ పేపర్

ఆన్‌లైన్‌లో నమోదు చేసి అమ్మకాలు

గతంలో బాండ్ పేపర్లను ఆఫ్ లైన్‌లో ఇష్టారీతిగా అమ్మకాలు చేసేవారు. అయితే గత రెండున్నరేళ్ల నుంచి బాండ్ పేపర్ల అమ్మకాలను ఆన్ లైన్‌లో నమోదు చేసుకుని అమ్ముతున్నారు. బాండ్ పేపర్ అమ్మాలంటే కొనుగోలు దారుల పేరుతోపాటు బాండ్ పేపర్ ఎందుకు అవసరమైందో పూర్తి వివరాలు నమోదు చేసుకున్న తర్వాతే అమ్ముతున్నారు. బాండ్ పేపర్లను పారదర్శకంగా అమ్మేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

రెండు నెలలుగా వేధిస్తున్న కొరత

రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి ప్రజల అవసరం మేరకు బాండ్ పేపర్లను సరఫరా చేస్తారు. కానీ గత రెండు నెలలుగా అవసరం మేరకు సరఫరా లేదు. దీంతో తమ పనులను వాయిదాలు వేసుకుంటున్నారు. ఇక స్టాంప్ బాండ్ పేపర్లు కొరతతో పేపర్లను నోటరీ చేసి సాధారణ ధర కంటే ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గుమ్మడిదల పట్టణ పరిధిలోని అన్నారం ప్రకృతి నివాస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో కాలనీ వాసులకు ఇచ్చిన హామీ మేరకు కాలనీని సందర్శించానన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల సమస్యలను సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరించారు. వెంటనే సమస్యల పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళి, సొసైటీ సభ్యులు వీణాచిన్న, తదితరులు పాల్గొన్నారు.



రఘునందన్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న నేతలు

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం



మోక్షితను సన్మానిస్తున్న గ్రామస్తులు

పుల్‌కల్(అందోల్): ఇటీవల వెలువడిన గ్రూప్–1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై శిక్షణలో ఉన్న చందంపేట మోక్షితకు గ్రామస్తులు సన్మానం చేశారు. మండల పరిధిలోని సూరెడ్డి ఇటిక్యాల గ్రామానికి చెందిన చందంపేట రాజేంద్రప్రసాద్ కూతురు మోక్షిత గ్రూప్- 1లో ఎంపికై మేడ్చల్ కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్ హోదాలో శిక్షణలో ఉన్నారు. మోక్షత డిప్యూటీ కలెక్టర్‌గా ఎదగడంతో గ్రామానికి చెందిన ఉద్యోగస్తులు, ప్రజాప్రతినిధులు సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ స్ఫూర్తితోనే ఉద్యోగం

గ్రూప్–1 విజేత సాహితి

జహీరాబాద్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితోనే తాను గ్రూప్ -1లో విజయం సాధించగలిగానని జహీరాబాద్ పట్టణానికి చెందిన సాహితి పేర్కొన్నారు. గ్రూప్–1లో ఉద్యోగం సంపాదించి అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా నియమితులైన సందర్భంగా మాల సంఘాల ఆధ్వర్యంలో ఆమెను ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాహితి మాట్లాడుతూ...తాను చిన్ననాటి నుంచి ఉపాధ్యాయుడైన తన తండ్రి శ్రీనివాస్ ద్వారా అంబేడ్కర్ గురించి తెలుసుకుని ఆయన పట్టుదల, స్ఫూర్తితోనే కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగం సాధించగలిగానన్నారు. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం మరువలేనిదని చెప్పారు. సామాజిక బాధ్యతగా జహీరాబాద్ నియోజకవర్గంలోని పాఠశాలలకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను ఉచితంగా అందించి తన వంతు తోడ్పడతానని హామీనిచ్చారు.



సాహితిని సత్కరిస్తున్న మాల సంఘాల నేతలు

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెంమహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. జీవనోపాధి కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చి దశాబ్దాలుగా నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రజలందరి అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఆయన తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటిగ్రామ శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దీపావళి పర్వదినం పురస్కరించుకుని ప్రతీఏటా ఉత్తర భారతీయులు ఘనంగా నిర్వహించుకునే చట్ పూజ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఎంపీటీసీగా ఎన్నికైన నాటి నుంచి ఎంపీపీ, మూడుసార్లు పటాన్‌చెరు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో ఇక్కడి ఉత్తరభారతీయుల మద్దతు మరువలేనిదని చెప్పారు. అతి త్వరలో ఉత్తర భారతీయుల కోసం ఫంక్షన్ హాల్, సాకి చెరువు కట్టపై సూర్యదేవుడి ఆలయం నిర్మించబోతున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రవాణశాఖ చెక్‌పోస్టులో ఏసీబీ సోదాలు

రూ.42,300 నగదు స్వాధీనం

జహీరాబాద్: రాష్ట్ర సరిహద్దులోని మొగుడంపల్లి మండలంలోని మాడ్గి గ్రామ శివారులోని రవాణశాఖ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం తెల్లవారు జామున ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ, డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో సిబ్బందితో తనిఖీల్లో పాల్గొన్నారు. శనివారం అర్ధరాత్రి దాటాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సరిహద్దు రవాణ శాఖ చెక్‌పోస్టుల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. అందులోభాగంగా జహీరాబాద్ సమీపంలోని 65వ జాతీయ రహదారిపై గల చెక్‌పోస్టులో ఆదివారం ఉదయం వరకు సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీబీ, డీఎస్పీ సుదర్శన్ విలేకరులతో మాట్లాడుతూ...చెక్‌పోస్టులో అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో అర్ధరాత్రి దాటాక ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో రూ.42,300 నగదు దొరికిందని వివరించారు. ఇందుకు సంబంధించి ఏఎంవీఐ కిరణ్‌కుమార్ సరైన సమాధానం చెప్పకపోవడంతో ఈ నగదును రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఏఎంవీఐ ప్రైవేటు వ్యక్తిని డ్రైవర్‌గా పెట్టుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.



చెక్‌పోస్టులో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

చేపపిల్లల పంపిణీకి సర్వం సిద్ధం

- మత్స్య భరోసా కింద అమలు
- ఈసారి 3.50 కోట్ల చేప పిల్లల పంపిణీ
- ప్రతీ చెరువు వద్ద పూర్తి వివరాలతో బోర్డులు

నారాయణఖేడ్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువుల నీటితో పూర్తిగా నిండి కళకళలాడుతున్నాయి. కాగా ప్రభుత్వం మత్స్యకారుల లబ్ధికోసం 'మత్స్య భరోసా'పథకం కింద చెరువుల్లో చేపపిల్లలను వదిలేందుకు సిద్ధమైంది. జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు అందుకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. రాష్ట్రంలో మత్స్య భరోసా పథకాన్ని ఇటీవల ప్రారంభించి చేపపిల్లలను చెరువుల్లో వదిలే కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలో వారంలోపు చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. గత నెలలోనే చేప పిల్లలను వదలాలని భావించినా భారీ వర్షాలు కురవడంతో వర్షాలు తగ్గుముఖం పట్టగానే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పథకం అమలు మరింత ఆలస్యం అయ్యింది.

జిల్లాలో 234 మత్స్యకార సంఘాలు

జిల్లాలో 1,135 నీటి వనరులు ఉండగా రిజర్వాయర్లు 3, శాశ్వత నీటి వనరులు 79, సీజనల్ నీరు నిల్వ ఉండే చెరువులు 1,025 ఉన్నాయి. 12,889 మంది సభ్యులతో 234 మత్స్య సహకార సంఘాలు కొనసాగుతున్నాయి. 8,200 మిల్లీమీటర్ల సైజు వరకు గల చేపపిల్లలను వదలనున్నారు. కట్ల రోహు, పెద్దపిల్ల, బంగారు తీగ, మృగాల, కొర్రమీను తదితర రకాల చొప్పున సుమారు 3.50కోట్ల చేపపిల్లలను వదలనున్నారు.



చెరువు వద్ద సైన్‌బోర్డు

భారీ ఎత్తున మత్స్య భరోసా కార్యక్రమం కింద చేపపిల్లలు వదిలే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలని యోచించింది. భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసింది. దసరా పండగలోగా కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినా స్థానిక ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చింది. పథకం కింద ప్రతీ చెరువు వద్ద ప్రత్యేకంగా రూపొందించిన సైన్ బోర్డును ఏర్పాటు చేస్తారు. సైన్ బోర్డుపై రెవెన్యూ గ్రామం, చెరువుపేరు, చెరువులో వదిలే చేపపిల్లల సంఖ్య, చెరువు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నదనే వివరాలను పొందుపరుస్తారు.

మత్స్య భరోసా కింద లబ్ధి

ప్రభుత్వం మత్స్యకారులను సంక్షేమం కోసం మత్స్య భరోసా పథకాన్ని ప్రవేశ పెట్టింది. మత్స్యశాఖ పరిధిలో జరిగే అభివృద్ధి, సంక్షేమం, రాయితీ ప్రోత్సాహకాలు అన్నీ మత్స్యభరోసా కింద అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రాథమిక మత్స్య సహకార సొసైటీల్లో ఉన్న బేస్త, గంగపుత్రులు, ముదిరాజ్, మత్స్యకార్మికుల కుటుంబాలకు ఈ పథకం కిందనే లబ్ధి చేకూర్చనున్నారు.

3.50కోట్ల చేపపిల్లల పంపిణీ

జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు సంసిద్ధంగా ఉన్నాం. మత్స్యశాఖ తరపున అన్ని ఏర్పాట్లు చేపట్టాం. వారంలోపు మంత్రి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. మత్స్యకారుల సంక్షేమం కోసం సుమారు మూడున్నర కోట్ల వరకు చేప పిల్లలను వదలనున్నాం.

– మధుసూదన్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సంగారెడ్డి

క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ఆదివారం అక్బర్‌పేట – భూంపల్లి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులు, పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టూబీహెచ్‌కే దాసరి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. తదుపరి పనులను త్వరలోనే ప్రారంభించాలన్నారు. ఆయన వెంట నాయకులు జన్నారెడ్డి, శ్రీనివాస్, జనార్దన్, రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హెల్ప్..హెల్ప్

పొదల్లో హైవే హెల్ప్‌లైన్ బోర్డు



కొడిపల్లి జాతీయ రహదారిపై పొదల మధ్యలో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్ బోర్డు

కొడిపల్లి(నర్సాపూర్): హెల్ప్‌లైన్ బోర్డుకు సహాయం కావాల్సి వచ్చింది. జాతీయ రహదారులపై అత్యవసర సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1033 నంబర్‌బోర్డు ముళ్ల పొదల్లో చిక్కుకుంది. దీంతో వాహనదారులకు నంబర్ కనిపించడం లేదు. మండల కేంద్రమైన కొడిపల్లి సమీపంలో బ్రిడ్జి వద్ద 765డి జాతీయ రహదారి సైడ్‌రేలింగ్ పక్కన హెల్ప్‌లైన్ నంబర్ బోర్డును ఏర్పాటు చేశారు. బోర్డు చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోవడంతో నంబర్ కనిపించడం లేదు. ఈ ఉచిత టోల్‌ఫ్రీ నంబర్‌తో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలు, ఇంధనం అవసరం, అంబులెన్స్ ఇతర అత్యవసర పరిస్థితుల్లో వాహనదారులు ఫోన్ చేసినట్లయితే ప్రభుత్వం వారికి సేవలు కల్పింస్తుంది. బోర్డు చుట్టూ ముళ్లపొదలను తొలగించి నంబర్ కనిపించేలా చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు స్వాధీనం



వాహనంలో తరలిస్తున్న గోవులు

ములుగు(గజ్వేల్): అక్రమంగా తరలిస్తున్న గోవులను వంటిమామిడి వద్ద రాజీవ్‌రహదారిపై ఆదివారం బీజేపీ, గోరక్షక్, బజరంగ్‌దళ్ నాయకులు అడ్డుకున్నారు. ఒడిశా నుంచి కొందరు వ్యక్తులు ఓ కంటైనర్ వాహనంలో 150 గోవులను హైదరాబాద్‌కు తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో వాహనాన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ గోవులతో ఉన్న వాహనాన్ని స్వాధీన చేసుకున్నారు. గోవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్‌ఐ గోవులను అక్కడి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం చల్లూరు గోశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధం



కాలిపోతున్న పూరిగుడిసె

హవేళీఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని స్కూల్ తండా పంచాయతీ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తండాలో నివాసముంటున్న పూల్య నిత్యంలాగే వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి పూరిగుడిసెలో ఉన్న నిత్యావసర వస్తువులు, నగదు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు పూల్య తెలిపాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నరేశ్ సందర్శించి వివరాలు సేకరించారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని అధికారులను కోరారు.

దొంగ అరెస్ట్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని హనీ బేకరీ తాళం పగులగొట్టి సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ మహేశ్ వివరాల ప్రకారం... దర్యాప్తులో భాగంగా పోలీసులు కొడిపల్లి మండల కేంద్రానికి చెందిన శరత్‌గా గుర్తించారు. నిందితుడు గతంలో కూడా ఓ కేసులో జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు.

అరచేతిలో సమగ్ర సమాచారం

వ్యవసాయశాఖలో సాంకేతిక విప్లవం

- రైతుల కోసం ప్రత్యేకంగా వాట్సాప్ ఛానల్
- జిల్లాలో 30 శాతం రైతుల చేరిక

వ్యవసాయంలో రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు నేరుగా అందించేందుకు ప్రభుత్వం సాంకేతికతను తీసుకొస్తుంది. పంటల సాగు, చీడ, పీడల గురించి పూర్తి సమాచారం రైతులు తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా వాట్సాప్ ఛానల్ ఇటీవల ప్రారంభించింది. ఇందులో ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న రైతులు వ్యవసాయ శాఖ అధికారులు అందించే లింక్ ద్వారా చేరవచ్చు. గ్రామాల్లో ఇప్పటికే రైతులకు ఈ చానల్‌పై అవగాహన కల్పిస్తున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ నిపుణులు ఆన్‌లైన్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందిస్తారు.

– మెదక్ కలెక్టరేట్

రైతులు వారికి కావాల్సిన సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే పొందవచ్చు. పంటలకు తెగుళ్లు, క్రిమికీటకాలు సోకినప్పుడు రైతులు ఈ ఛానల్ ద్వారా కావాల్సిన సమాచారం పొందవచ్చు. ప్రస్తుతం రైతులు ఆశించిన స్థాయిలో వ్యవసాయ సమాచారం లేకపోవడంతో పంటల్లో దిగుబడులు కోల్పోతున్నారు. చీడ,పీడలతో పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ రైతులకు ఒకేసారి సమాచారం పొందడానికి ఈ డిజిటల్ వ్యవసాయ పరిజ్ఞానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. విత్తన దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు పంటల పూర్తి సమాచారం రైతులు తెలుసుకోవచ్చు.

ఏఈఓల ద్వారా చేరవచ్చు

మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు రైతులను ఈ ఛానల్‌లో లింక్ ద్వారా చేర్చుతున్నారు. పంటలకు కావాల్సిన పూర్తి సమాచారాన్ని ఈ ఛానల్ ద్వారా క్షణాల్లో పొందవచ్చు. అన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుంది. సమయం, ఖర్చు తగ్గుతుంది.

ప్రభుత్వ పథకాలు

ప్రభుత్వం ఏ పంటకు ఎంత సబ్సిడీ ఇస్తుంది. ఏ సీజన్‌లో ఏ పంట సాగుచేస్తే ప్రయోజనం ఉంటుంది. వాతావరణ సమాచారం, విత్తనం నాటు వేయడం, కోత తీయడం పద్ధతులతోపాటు సస్యరక్షణలో తీసుకోవాల్సిన అన్ని రకాల జాగ్రత్తల గురించి సమాచారం పొందవచ్చు. సీజన్‌ల వారీగా పంటలు సాగు చేసి, చీడ, పీడలను అధిగమించి రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చు. అందుకోసం వాట్సాప్ ఛానల్ ఎంతగానో ఉపయోగపడుతుంది.



వాట్సాప్ ఛానల్‌లో లభిస్తున్న ఫొటో సమాచారం

మంచి అవకాశం



రాష్ట్ర వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన వాట్సాప్ ఛానల్ చాలా బాగుంది. రైతులకు కావాల్సిన పూర్తి సమాచారం ఇందులో దొరుకుతుంది. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు వేయాలి. ఎలాంటి మందులు ఎంత మోతాదులో వాడాలి. పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వంటి అంశాలపై సూచనలు పొందవచ్చు.

– శ్యామ్, రైతు,తొగిట, హవేళఘనాపూర్

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో 76 క్లస్టర్లు ఉన్నాయి. ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈఓల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. స్మార్ట్ ఫోన్లు ఉన్న రైతులంతా ఛానల్‌లో చేరేలా కృషి చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 30శాతం రైతులు ఈ ఛానల్‌లో చేరారు. రైతులంతా ఛానల్‌లో చేరి అవసరమైన వ్యవసాయ సమాచారం పొందాలి.

– దేవ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, మెదక్

వృద్ధురాలిపై పైసాచిక దాడి

డబ్బుల కోసం..

- కొడుకులు, మనవళ్ల కర్కశం
- చికిత్స పొందుతూ మృతి
- పోస్టుమార్టం రిపోర్టుతో విషయం బయటకు
- ఆరుగురి అరెస్ట్, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

వట్‌పల్లి(అందోల్): డబ్బుల కోసం కన్న తల్లిని కర్రలతో కొట్టగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ కేసులో ఇద్దరు కొడుకులు, నలుగురు మనవళ్లను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. ఆదివారం సీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ లవకుమార్ కేసు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని మర్వెల్లి గ్రామానికి చెందిన చాకలి బసమ్మ(80) ఈనెల 1వ తేదీన అరుగుపై పడుకొని కిందపడి అనారోగ్యానికి గురైదని 3వ తేదీన సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 4న ఆమె మృతి చెందింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పలు కోణాల్లో విచారణ చేశారు. కాగా వృద్ధురాలికి ఛాతి, ఇతర భాగాల్లో రక్తపు గాయాలై మరణించినట్లు పోస్టుమార్టం రిపోర్టు వచ్చింది. దీంతో జోగిపేట సీఐ అనిల్‌కుమార్ గ్రామానికి వెళ్లి కుమారులను విచారించగా తమ తల్లి పోషణ విషయంలో తరుచుగా గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతోపాటు రైతుబంధు, పింఛన్ డబ్బుల విషయంలో గొడవపడ్డామని తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరు కుమారులు చాకలి బసయ్య, చాకలి వెంకయ్యతో పాటు మనువళ్లు అంబయ్య, నర్సింహులు, మోహన్, రాజు మద్యం మత్తులో వృద్ధురాలిని కర్రలతో కొట్టి చంపినట్లు నేరం అంగీకరించారు. పథకం ప్రకారం అరుగు పైనుంచి పడి అనారోగ్యానికి గురైందని అందరిని నమ్మించామని తెలిపారు.

26 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయిని, నిందితుడిని మీడియాకు చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వినాయక్ రెడ్డి వివరాల ప్రకారం... ఆటోలో గంజాయిని తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి ముత్తంగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆటో డ్రైవర్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన నిశాద్ వీరేంద్ర కుమార్‌గా గుర్తించారు. దర్యాప్తులో నిందితుడు ఒడిశాకు చెందిన ఘెను అనే వ్యక్తి గంజాయి ఇస్తాడని, అది తీసుకెళ్లి చెప్పిన ప్రదేశంలో ఇస్తే రూ. 50 వేలు ఇస్తానని చెప్పడంతో డబ్బుకు ఆశపడి చేసినట్లు తెలిపాడు. పట్టుబడిన 26.4 కిలోల గంజాయిని, రవాణాకు ఉపయోగించిన ఆటో, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. నిందితుడు వీరేంద్ర కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని.. మహిళ మృతి



ఇందూర్ సాలవ్వ

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కామారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన ఇందూర్ సాలవ్వ(50) శనివారం ధాన్యం ఆరబెట్టేందుకు కూలిపనులకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన రైతు భాగయ్య బంధువు ఆవుసులపల్లి గ్రామానికి చెందిన కుంట స్వామి ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకువస్తూ రివర్స్ చేస్తున్న క్రమంలో మహిళను గమనించకుండా ఢీకొట్టాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహనం ఢీకొని కూలీ..

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లకు చెందిన మన్నె దశరథ (38) కూలీ పని కోసం శనివారం మండలంలోని కాళ్లకల్‌కు వచ్చాడు. రాత్రి శివారులో దీపక్ దాబా వద్ద జాతీయ రహదారి -44పై రోడ్డు దాటుతున్న క్రమంలో కంటైనర్ ఢీకొట్టడంతో లారి కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



బెన్ని కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన బెన్ని కుమార్ (58) మెదక్ ఇరిగేషన్ కార్యాయలంలో విధులు ముగించుకుని అదే గ్రామానికి చెందిన నిఖిల్ స్కూటీపై వస్తున్నారు. గవ్వలపల్లి చౌరస్తా వద్ద టీవీఎస్ ఎక్స్‌ఎల్ అడ్డుగా రావడంతో అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో బెన్నికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడ్ని మేడ్చల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ఫైనాన్స్ వేధింపులు.. యువకుడు ఆత్మహత్య



వినోద్ కుమార్

నంగునూరు(సిద్దిపేట): ఫైనాన్స్ వేధింపులు భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని బద్దిపడగలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలు... గ్రామానికి చెందిన అవేటి వినోద్ కుమార్ (28) ఆరు నెలల కింద ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.50 వేలు చెల్లించి రూ .4.50 లక్షల లోన్‌తో డోజర్ ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అది సరిగా నడవకపోవడంతో ఈఎంఐలు కట్టలేదు. దీంతో డబ్బులు కట్టాలని ఫైనాన్స్ వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. అతనికి భార్య రేఖ, కూతురు కీర్తన, కుమారుడు అక్షిత్ ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక..

మునిపల్లి(అందోల్): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుదేరా ఏఎస్‌ఐ ఎం. రవి వివరాల ప్రకారం... మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామానికి చెందిన ఎండీ దుదేకుల మదార్ పాషా (42)కు కొంత కాలంగా కడుపునొప్పి వస్తోంది. దీంతో ఆయన తరచు మద్యం తాగేవాడు. ఈ క్రమంలో ఆదివారం కడుపునొప్పి రావడంతో తాగిన మత్తులో వ్యవసాయ పొలం దగ్గర ఉన్న చింత చెట్టుకు తాడుతో చెట్టుకు ఉరివేసుకున్నాడు.

అప్పులు తీర్చలేక...



నరేశ్‌చారి

మెదక్ మున్సిపాలిటీ: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబీకుల కథనం మేరకు... మెదక్ పట్టణంలోని పెద్ద బజార్ వీధికి చెందిన నరేశ్‌చారి(40) కులవృత్తిపై ఆధారపడి భార్య, పిల్లలను పోషిస్తున్నాడు. నిత్యం బంగారం ధరలు పెరుగుతుండటంతో ఉపాధి దొరకడం కష్టంగా మారింది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక నరేశ్ చారి తన ఇంట్లోనే ఉరివేసుకున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో..



నాగరాజు

వెల్దుర్తి(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మేడ్చల్మె నాగరాజు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆటో ఫైనాన్స్ డబ్బులు కట్టడానికి ఇబ్బందులు తలెత్తడంతో కుటుంబంలో చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న ఎస్‌ఐ. వినయ్‌కుమార్, వెనకాల నిందితుడు

జహీరాబాద్ టౌన్: హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం టౌన్ ఎస్‌ఐ.వినయ్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. తమిళనాడు మధురై జిల్లా పరిమల్‌పట్టికి చెందిన పుతురాజు పట్టణంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. స్నాక్స్, కారబుంది తయారు చేసి అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి మణికంఠ పట్టణంలోని హమాలీ కాలనీలో నివాసం ఉంటూ ఆయన కూడా ఇదే వ్యాపారం చేస్తున్నాడు. తాను వ్యాపారం చేస్తున్న ప్రాంతాల్లో పుతురాజ్ బిజినెస్ చేస్తున్నాడని కక్షపెంచుకున్న మణికంఠ శనివారం కత్తితో దాడి చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..

ఒకరికి తీవ్రగాయాలు

వట్‌పల్లి(అందోల్): ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండల సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా... రాంచంద్రపూర్‌కు చెందిన యేసురత్నం బైక్‌పై గట్‌పల్లి వైపు నుంచి వట్‌పల్లికి వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో రోడ్డుకు దూరంగా పడిపోయి తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించగా, జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ రోడ్డుపై మోకాలి లోతు గుంతలు ఏర్పడి ప్రమాదాల భారిన పడుతున్న, వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

యువతి అదృశ్యం



బొమ్మల తులసి

నర్సాపూర్ రూరల్: యువతి అదృశ్యమైంది. ఈ ఘటన నర్సాపూర్ మండలం తిరుమలాపూర్‌లో శనివారం జరిగింది. ఎస్సై రంజిత్ రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొమ్మల లక్ష్మి కూతురు తులసి (19) రోజులాగే తాను పనిచేస్తున్న మార్ట్‌కు వెళ్తున్నానని శనివారం ఉదయం ఇంట్లో చెప్పి బయలుదేరింది. రాత్రి 10 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా తల్లి బొమ్మల లక్ష్మి తన కూతురు నారాయణపూర్‌కు చెందిన బలిజ రాజు అపహరించుకుపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మాసాయిపేట మండల శివారులోని 44వ జాతీయ రహదారి బంగారమ్మ దేవాలయ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... చేగుంట నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న ట్రాలీ ఆటోను వెనకాల వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రహ మాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అత డ్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

మంజీరాలో పడి యువకుడు మృతి

కొల్చారం(నర్సాపూర్): ప్రమాదవశాత్తు యువకుడు మంజీరా నదిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ కాకినాడకు చెందిన నీల సత్తిబాబు కుమారుడు నాని బాబు (21) స్నేహితులతో కలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం ఏడుపాయలకు కారులో వచ్చారు. దర్శనం చేసుకున్న అనంతరం సాయంత్రం స్నానాల కుంటలోకి దిగారు. అతను సెల్ఫీ తీసుకుంటుండగా కాలుజారి ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. లోతుగా ఉండటంతో మునిగిపోయాడు. గజ ఈతగాళ్ల సహాయంతో బయటకి తీయగా అప్పటికే మృతి చెందాడు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



పాండురంగ చారి

జిన్నారం (పటాన్‌చెరు): గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై హనుమంతు వివరాల ప్రకారం... గడ్డపోతారం పట్టణ పరిధిలోని చౌదరిగూడెం గ్రామానికి చెందిన పాండురంగ చారి (45) శనివారం గ్రామంలోని లింగం చెరువులోకి ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలించగా ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి ముగ్గరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నాడు.

ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి..



పెద్దగొల్ల జగన్

వట్‌పల్లి(అందోల్): మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఇంటర్ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్ మండలం రోళ్లపాడ్ గ్రామానికి చెందిన పెద్దగొల్ల రాములు కుటుంబంతో ఇస్నాపూర్‌లో ఉంటున్నాడు. పెద్ద కుమారుడు జగన్(17) శంకర్‌పల్లిలోని ప్రభుత్వ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 16న ఉదయం కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి చింతకుంట మంజీరా బ్రిడ్జి వద్ద నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నదిలో వరద ప్రవాహం ఉండటంతో మృతదేహం ఆచూకీ లభించలేదు. ఆదివారం కొల్చారం మండలం పైతర గ్రామ శివారులోని మంజీరా చెక్‌డ్యాం వద్ద నదిలో మృతదేహం కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి పెద్దగొల్ల జగన్‌గా గుర్తించారు.

చెరువులో పడి వ్యక్తి...

మెదక్ మున్సిపాలిటీ: చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని దాయర వీధికి చెందిన అదరాసి మహేశ్(28) గోసముద్రం చెరువులో స్నానం చేసేందుకు ఈనెల 18న వెళ్లాడు. తిరిగి రాక పోగా ఆదివారం చెరువులో శవమై కనిపించాడు. మృతుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మేతకు తీసుకెళ్తుండగా.. ఢీకొట్టిన డీసీఎం

- ప్రమాదంలో 15 గొర్రెలు మృతి
- కాపరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లకుడారం గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మరికల్ గ్రామానికి చెందిన రంగొళి నారాయణకు 500 గొర్రెలున్నాయి. ఈ క్రమంలో మేత దొరక్కపోవడంతో 2 నెలల కింద కొండపాక, తొగుట సరిహద్దు శివారులో గల మల్లన్న సాగర్ జలాశయం ప్రాంతానికి నారాయణతో పాటు ఇద్దరు గొర్రెల కాపరులతో వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో జలాశయంలో నీరు చేరడంతో మేత దొరకడం కష్టంగా మారింది. దీంతో గొర్రెలను తీసుకొని రాజీవ్ రహదారి వెంబడి కరీంనగర్ జిల్లా జమ్మికుంట వైపునకు వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి రోడ్డు వెంట వెళ్తున్న గొర్రెల మందను ఢీకొట్టగా 15 గొర్రెలు మృతి చెందాయి. కాపరి బాలయ్యకు గాయాలయ్యాయి. సుమారు రూ. 2లక్షలు నష్టం జరిగిందంటూ బాధితుడు పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన గొర్రెలను రోడ్డు పక్కకు జరిపించారు. డ్రైవర్ బోయిని స్వామిపై కేసు నమోదు చేశారు.

బాణాసంచా ధరలు.. పేలుతున్నాయ్

గతేడాదితో పోలిస్తే పెరిగిన ధరలు

- దీపావళి సామగ్రి కొనుగోలుదారులతో సందడి
- కిటకిటలాడుతున్న మార్కెట్లు

సంగారెడ్డి క్రైమ్: దీపావళి అంటేనే సిరుల పండుగ. దీప కాంతులు, బాణాసంచా వెలుగుల మధ్య పండుగను జరుపుకుంటారు. పట్టణంలో దీపావళి సందడి మొదలైంది. వేడుకలకు బాణాసంచా వేదిక అవుతుండగా వాటి కొనుగోళ్లు మార్కెట్‌లో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మండే మార్కెట్, మహిళా ప్రాంగణం ఎదురుగా, పీఎస్ఆర్ గార్డెన్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో చిన్నారులకు ఎంతో ఇష్టమైన చిచ్చుబుడ్లకు, తారాజువ్వలకు భారీ డిమాండ్ పెరిగింది. అలాగే కాకరవొత్తులు ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అయినా సంవత్సరానికి ఒకసారి వచ్చే పండుగ కోసం అటు పిల్లలు ఇటు పెద్దలు ఆనందం కోసం వెచ్చించక తప్పడం లేదు. ఆ కారణంగానే దుకాణాలకు వెళ్లే వినియోగదారులపై ధరల మోత మోగుతోంది. టపాకాయల అమ్మకాలు లేక సతమతమవుతున్న వ్యాపారులు ఇదే అదునుగా అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

20% ధరలు పెరుగుదల

గత సంవత్సరంతో పోలిస్తే టపాకాయలకు ఈసారి ధరలు భారీగా పెరిగాయి. మార్కెట్‌లో ఏకంగా 20 నుంచి 30% మేర ధరలు పెంచారు. దీంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు టపాసులు కొనుగోలు తగ్గించారు. పట్టణంలో టపాకాయల ధరలు చిచ్చుబుడ్ల బాక్సు ధర రూ.200 నుంచి 600, తౌజెండ్ వాలా రూ. 600 నుంచి 1500, 5 తౌజెండ్ వాలా రూ. 3వేల నుంచి 3500 వరకు, భూచక్రాలు బాక్స్ సైజును బట్టి రూ.50 నుంచి 300, 30 షార్ట్స్ రూ. వెయ్యి నుంచి 2 వేలు, రాకెట్లు బాక్సు ధర రూ.150 నుంచి 1500, మిర్చి ప్యాకెట్ ధర రూ.50 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే వీటి ధరలో 20 నుంచి 30 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే గతంతో పోలిస్తే విక్రయాలు కూడా భారీగా పడిపోయాయని పేర్కొంటున్నారు.



టపాకాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

విక్రయాలు భారీగా తగ్గాయి



మార్కెట్‌లో చిన్న పిల్లలకు అటు యువతకు నచ్చేలా అన్ని రకాల టపాకాయలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది దుకాణాల సంఖ్య పెరగడంతో విక్రయాలు భారీగా తగ్గాయి. దీంతో ఆశించిన మేర లాభాలు రావడం లేదు.

– ఆకాశ్, దుకాణదారుడు, సంగారెడ్డి